విలన్‌లుగా మార్క్స్,లెనిన్ పేర్లను తొలగించాలి

చేవెళ్లటౌన్, జనవరి 18: గుంటూరు కారం సినిమాలో విలన్‌లుగా పెట్టిన మార్క్స్, లెనిన్‌ల పేర్లను వెంటనే తొలగించాలని పీడీఎస్‌యూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. దోపిడీ, పీడన అణచివేతలేని సమాజం కోసం తన జీవితాంతం కృషి చేసిన మార్క్స్, లెనిన్‌ల మహనీయుల పేర్లను విలన్‌లుగా పేర్లు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో క్షమాపణలు చెప్పి పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఆమనగల్లు : ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు, జనవరి 18 : మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్ –శ్రీశైలం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం ప్రభుత్వ దవాఖానలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ యాదిలాల్, పార్లమెంట్ కోశాధికారి నర్సింహ్మ, నాయకులు కండె భాస్కర్, కండె సత్యం, పెంటయ్య, శంకర్, శివ, వెంకటయ్య, కృష్ణయ్య, కాలె మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్ : దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు సేవలు చిరస్మరణీయమని టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ కార్యదర్శి కాసుల సుభాన్‌గౌడ్ అన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల వలయంగా బస్టాండ్

- చిమ్మచీకటిలో ప్రయాణికుల అవస్థలు
- మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు
- కుర్చీలు, మంచినీటి వసతి కరువు

యాచారం, జనవరి18: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అధ్వాన్నంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ కొన్నేండ్లుగా వృథాగానే ఉండిపోయింది. భూవివాదం కారణంగా ప్రారంభమైన మూన్నాళ్లకే మూతబడింది. దీంతో బస్టాండ్‌లో కాకుండా అంబేద్కర్ చౌరస్తా వద్ద బస్సులను ఆపడం మొదలు పెట్టారు. కొన్ని నెలల తరువాత భూ వివాదం తొలిగిపోవడంతో అప్పటి రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి కొన్ని నిధులను కేటాయించి బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టారు. తిరిగి బస్టాండ్‌లో మళ్లీ బస్సులను ఆపడం మొదలు పెట్టారు. అయిన్పటికీ అది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. చౌరస్తాకు బస్టాండ్ కాస్తా దూరం ఉండటంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావడానికి అనాసక్తిని చూపించారు. ఇదే అదునుగా బావించిన ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను చౌరస్తా వద్దనే కొన్నేండ్లుగా ఆపుతున్నారు. దీంతో అది ప్రైవేటు వాహనాలు, పంచాయతీ పరిష్కారాలకు అడ్డగా మారింది. కానీ అంబేద్కర్ చౌరస్తా వద్ద కందుకూరు రోడ్డుతో కూడిన కూడలి ఉంది. ఒకప్పటితో పోలిస్తే ట్రాఫిక్ సమస్య ఒక్కసారిగా రెట్టింపయ్యింది. ప్రైవేట్ వాహనాలు క్రజర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్డు కిరువైపులా నిలపడం. అక్కడే యూటర్న్ సౌకర్యం కలిగి ఉండటం, రోడ్ల పైనే చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ప్రజలు ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. పైగా రోడ్డుపై ఒక్క ఆర్టీసీ బస్సు ఆపినా ట్రాఫిక్ బారులు తీరుతుంది. ఇటీవల మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సులు నిమిషాల తరబడి నిలపడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమయ్యింది. దీనికి పరిష్కారం చూపుతూ ఆర్టీసీ బస్సులను బస్టాండ్‌లో నిలపాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ, ప్రయాణికుల అవసరాలను తీర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో వసతులు లేమితో సమస్యల వలయంలో యాచారం బస్టాండ్ కొట్టుమిట్టాడుతుంది.

శిథిలావస్థకు మరుగుదొడ్లు

బస్టాండ్‌లో అప్పట్లో నిర్మించిన మురుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా ఉండటంతో అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రయాణికులు మల, మూత్ర విసర్జణ చేయడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు, మరమ్మతులు చేయించి, ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. దాహార్థిని తీర్చేందుకు తాగు నీటిని అందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కరెంట్ లేక ఇక్కట్లు

బస్టాండ్‌లో అధికారులు కనీసం విద్యుత్ సౌకర్యాన్ని కల్పించలేక పోవడం గమనార్హం. కరెంట్ లేకపోవడంతో రాత్రిపూట బస్టాండ్ అంధకారాన్ని తలపిస్తుంది. దీంతో సాయంత్రం, తెల్లవారుజామున ప్రయాణికులు చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో విద్యుత్ ఏర్పాటు చేయా లని ప్రయాణికులు కోరుతున్నారు. సరి పడా కుర్చీలు ఏర్పాటు చేసి, బస్టాండ్‌లో ఉన్న దుకాణ షెట్టర్లను సైతం ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న దుకాణాలు

సమస్యలను పరిష్కరించాలి

బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలి. మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉపయోగంలోకి తీసుకురావాలి. కుర్చీలు, తాగునీటి వసతిని కల్పించాలి. విద్యుత్, పార్కింగ్ వసతిని ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలి.

– పొద్దుటూరి రవీందర్‌గుప్తా, మేడిపల్లి (యాచారం)

మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తాం

యాచారం బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం. త్వరలోనే మాత్రశాలలు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొస్తాం. గతంలో విద్యుత్ బకాయిలు ఉన్నందున కరెంట్ సరఫరాను నిలిపేశారు. త్వరలోనే కొత్త కనెక్షన్ తీసుకొని సమస్యను పరిష్కరిస్తాం. బోరుబావిని మరమ్మతు చేయించి నీటి సమస్యను పరిష్కరిస్తాం. దేవరకొండ తదితర డిపోలకు చెందిన బస్సులను బస్టాండ్‌లో ఆపేందుకు చర్యలు చేపడుతాం.

– సరస్వతి, అసిస్టెంట్ మేనేజర్ ఇబ్రహీంపట్నం డిపో

ఆగని దేవరకొండ ఎక్స్‌ప్రెస్ బస్సులు!

బస్టాండ్‌లో దేవరకొండ ఎక్స్‌ప్రెస్ బస్సులను బస్టాండ్‌లో నిలుపకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. యాచారం నుంచి హైదరాబాద్, చింతపల్లి, మల్లెపల్లి, దేవరకొండ వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు దేవరకొండ బస్సులు యాచారం బస్టాండ్‌లో నిలిపేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాత్రి అంధకారంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్

అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి

సమావేశానికి హాజరైన ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు

షాబాద్, జనవరి 18: రానున్న ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో అనురాధ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జీపీడీపీ(గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక)పై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి గ్రామాల్లో పంచాయతీ అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని పంచాయతీల్లో గ్రామసభల ద్వారా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకుని ఆమోదింపజేసుకోవాలని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని, గడువులోగా వందశాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఈ ఏడాది హరిత హారం కార్యక్రమానికి గాను నర్సరీల్లో విత్తనాలు నాటించి మొక్కలు పెంచాలని సూచించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు పూర్తైందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో హన్మంత్‌రెడ్డి, ఏపీవో వీరాసింగ్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి, జనవరి 18 : గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అలాం ఖాన్‌గూడ గ్రామ అనుబంధ గ్రామం చిన్నా రెడ్డిగూడెంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో చాలా వరకు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని తెలిపారు. అభివృద్ధిలో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ మానిక, ఎంపీడీవో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 18 : ట్రాన్స్‌ఫార్మర్ల బ్రేకర్ల మెయింటనేజ్, చెట్ల కొమ్మల తొలగింపు పనుల వల్ల శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇబ్రహీంపట్నం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని గురునానక్, చర్లపటేల్‌గూడ, నాగన్‌పల్లి, శేరిగూడ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు, వైట్‌గోల్డ్ సబ్‌స్టేషన్, ఆక్టోపస్ ఫీడర్, సీతారాంపేట్, అంబేద్కర్‌నగర్, నాగన్‌పల్లి ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణాయాదవ్

బీసీసేన మండల అధ్యక్షుడిగా రమేశ్‌యాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణాయాదవ్

షాబాద్, జనవరి 18: బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణాయాదవ్ అన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో బీసీసేన సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని కుర్వగూడ గ్రామానికి చెందిన రమేశ్‌యాదవ్‌ను బీసీ సేన మండల అధ్యక్షుడిగా నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. అర్హులైన బీసీలందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెండ్యాల చందు, శ్రీశైలం, సతీశ్, కృష్ణ, రవికుమార్, శివకుమార్, జంగయ్య, యాదగిరి తదితరులున్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

తచేవెళ్లటౌన్, జనవరి 18: ఎయిడ్స్ మహమ్మారి బారిన పడి అనేకమంది చిన్న వయసులో తమ కుటుంబాలకు దూరమవుతున్నారని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సభ్యులు తెలిపారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పల్లెసందులవారి కళా ప్రదర్శనతో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, ఎయిడ్స్ నివారణకు అవగాహన ఒకటే మార్గమని చెప్పారు. కార్యక్రమంలో కంట్రోల్ సొసైటీ సభ్యులు సీత, గీత, నీరజ, విజయ, లత, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

చేవెళ్లటౌన్, జనవరి 18 : ప్రతి వాహనదారుడు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని లేకపోతే వారి పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోలో ప్రయాణికులు డ్రైవర్ పక్క సీట్లో కూర్చోవద్దని డ్రైవర్లకు సూచించారు. ఆటో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫామ్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వాళ్లకు మీ వాహనాలను ఇస్తే వారి పైన చర్యలు తీసుకోవడంతో పాటు వారికి జైల్ శిక్ష విధించడం జరుగుతుందని చెప్పారు. నిబంధనలను తప్పని సరిగా పాటించాలని ఆయన సూచించారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

మంచాల, జనవరి 18 : లింగంపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీనర్సింహ్మ పురుషుల పొదుపు సంఘంలో సభ్యులుగా ఉండి అనారోగ్యంతో మృతి చెందిన వారికి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మైలారం విష్ణు, అనంతచారి కుటుంబాలకు పొదుపు సంఘం నుంచి ఒక్కొక్కరికీ రూ. 10వేల చొప్పున ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, పరమేశ్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృత్తివిద్య కోర్సులను ప్రవేశపెట్టాలి

షాద్‌నగర్‌రూరల్, జనవరి 18: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తివిద్య కోర్సులను ప్రవేశపెట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. దీని కోసం కళాశాల భవనం నిర్మించేలా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎంతో చరిత్ర కలిగిన మొగిలిగిద్దలో నూతన భవనం ఏర్పాటు చేసి వృత్తివిద్య కోర్సులను ప్రవేశపెడితే ఎంతో మంది విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక సేవకుడు శ్యామ్‌సుందర్, అధ్యాపకులు శ్రీశైలం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

20, 21న స్పెషల్ సమ్మరి రివిజన్

యాచారం, జనవరి18: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 20, 21న మండలంలో స్పెషల్ సమ్మరి రివిజన్ –2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లో స్పెషల్ కాంపెయిన్‌ను నిర్వహిస్తామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో సంబంధిత బూత్ లెవల్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, సలహాలపై అధికారులను సంప్రదించాలని సూచించారు. రెండు రోజులు నిర్వహించే ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం, జనవరి18: విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా తక్కళ్లపల్లిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ అవసరాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, వ్యవసాయ అవసరాలకు మధ్యాహ్నం 1గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్‌ను నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు.

మిస్టరీ వీడని ఓఆర్ఆర్ కేసు ఘటన

- గోనె సంచిలో మృతదేహం.. మృతుడి వివరాల కోసం పోలీసుల దర్యాప్తు
- మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి ఆధ్వర్యంలో తొమ్మిది బృందాల ఏర్పాటు

ఆదిబట్ల, జనవరి 18: ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ వద్ద గోనె సంచిలో మృతదేహం గుర్తించిన కేసులో నేటికీ మిస్టరీగానే మిగిలింది. మూడు రోజుల క్రితం ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని బ్రహ్మణపల్లి ప్రాంతంలో గోనే సంచిలో లభ్యమైన మృతదేహం ఎవరిది..? ఎక్కడ చంపి ఎవరు పడివేశారనే దానిపై పోలీసులు ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టారు. మృతుడి చేతులు, కాళ్లు కట్టేసి ఎక్కడో హత్యచేసి గోనె సంచిలో మృతదేహాన్ని తీసుకువచ్చి ఔటర్ రింగురోడ్డు పై నుంచి నిర్మాణుష ప్రాంతంలో పారేశారు. మృతుడి ఒంటిపై చేతికి కడియం, మెడలో బంగారు గొలుసు, కాలికి నల్లదారం ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఇప్పటికీ మృతదేహాన్ని గుర్తించడానికి ఎవ్వరు రాలేదు. దీంతో పూర్తిస్థాయిలో విచారణ వేగం చేశారు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి ఆధ్వర్యంలో తొమ్మిది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా దర్యాప్తు చేపడుతున్నారు. ఐదు రోజుల క్రితం ఓఆర్ఆర్‌పై ప్రయాణించిన వాహనాలు, సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అదే విధంగా చుట్టు పక్కల పోలీస్ స్టేషన్లలో మిస్సింగ్ కేసుల వివరాలు సేకరించే పనిలో పోలీసులు పడ్డారు.

మృతదేహం పడేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జనవరి18 : యువత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సమాజసేవలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదినం పురస్కరించుకుని ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానలో రక్తదాన శిబిరం, మూర్తూజపల్లి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిబిరంలో 50 మంది యువకులు పాల్గొని రక్తదానం చేయగా, ఆమనగల్లు ప్రభుత్వ దవాఖాన, కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. అదేవిధంగా వివిధ మండలాల్లో జన్మదిన వేడుకలను నిర్వమించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్, ఎంపీపీ నేనావత్ అనిత, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జిల్లా గంధ్రాలయ సంస్థ డైరెక్టర్ వి.జంగయ్య, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు జగన్, వి.మానయ్య, కేఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గ మహేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణానాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు వస్పుల శ్రీశైలం, నాయకులు విజయ్, వాటర్ బాబా, పి.పరమేశ్, శ్రీకాంత్, ఫరీద్, నాజర్, సురేశ్‌నాయక్, మహేశ్, వి.మహేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మొయినాబాద్, జనవరి 18 : మండల పరిధిలోని చందానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో1995–96 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు జయప్రకాశ్, కృష్ణారెడ్డి, నిర్మల, జ్యోతి, కృష్ణారెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గణేశ్‌గౌడ్, ఆంజనేయులు, రాఖేశ్, రఘు, శ్రీశైలం, రమేశ్, సుధాకర్, సామెల్, శైలజ, ఉమారాణి, లక్ష్మి, కంసమ్మ తదితరులు పాల్గొన్నారు.

20, 21న ఓటరు నమోదు క్యాంపు

మంచాల, జనవరి 18 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో ఓటరు నమోదు క్యాంపును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కును పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో బీఎల్‌వోల వద్ద తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఓటరు నమోదుకు అన్ని పార్టీలు సహకరించాలని ఆయన కోరారు.

అబ్దుల్లాపూర్‌మెట్టు : మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 20, 21వ తేదీన ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ రవీందర్‌దత్తు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువత తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. శనివారం, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నది, లేనిది తప్పులు ఉన్నాయా? లేవా? అని సరి చూసుకోవాలని సూచించారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం–6, తొలగింపునకు ఫారం–7, మార్పు చేర్పులకు ఫారం–8 ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 18 : ఇబ్రహీంపట్నం మైనార్టీ గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి 5 తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వజ్రమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్ రెండవ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. వివరాల కోసం 9989752088, 7893992015 నెంబర్లను సంప్రదించాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.